క్లుప్తంగా

రేపు గజ్వేల్‌లో జాబ్ మేళా

గజ్వేల్‌రూరల్: నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ అనితా అబ్రహం, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ శోభారాణి పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 21న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పలు ప్రైవేటు బ్యాంకింగ్ తదితర 14కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న వారితో పాటు డిగ్రీ, పీజీ పూర్తయినవారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రెజ్యూమ్‌తో పాటు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని, వివరాలకు 89857 10323 నంబరులో సంప్రదించాలని సూచించారు.

23న జాబ్ మేళా..

సిద్దిపేటజోన్: నియోజకవర్గ నిరుద్యోగ యువతుల కోసం ఈనెల 23న మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం స్థానిక విపంచి ఆడిటోరియంలో హైదరాబాద్ ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ క్యూస్ విన్నింగ్ టూగేదర్ వారి సౌజన్యంతో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.18 ఏండ్ల పై వయస్సు కల్గి పది నుంచి డిగ్రీ వరకు విద్యార్హతలు ఉన్న మహిళలు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి 15 రోజుల పాటు శిక్షణనిచ్చి ఉద్యోగంలోకి తీసుకుంటారని పేర్కొన్నారు. వివరాలకు 94417 99884, 98489 99990, 99898 08022 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తోఫాలపై బీఆర్‌ఎస్ నాయకుల ఫొటోలా!

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రంజాన్ పర్వదినం సందర్భంగా పేద ముస్లింల కోసం స్వచ్ఛంద సంస్థలు పంపిణీ చేస్తున్న రంజాన్ తోఫాలపై బీఆర్‌ఎస్ నాయకుల ఫొటోలు ఉండటం సరి కాదని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. స్వచ్ఛంద సేవా సంస్థలు రంజాన్ తోఫాలు పంపిస్తే వాటిని తామే ఇస్తున్నట్లుగా బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేసుకోవడం బాధాకరమన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఫయాజుద్దీన్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సలీం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనాల పరిశీలన



విద్యార్థుల ఇంటికి వెళ్లిన ఉపాధ్యాయులు

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మేడిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం రాత్రి పదవ తరగతి విద్యార్థుల అభ్యసనా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల చదువులెలా సాగుతున్నాయో గుర్తించారు. విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్ వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులను ఉత్తమంగా తయారు చేయడానికి కుటుంబం పునాది వంటిదన్నారు. పిల్లలకు సరైన భోజనం, బట్టలు అందించడం ముఖ్యం కాదని, వారు ఎదుగుతున్న తీరును పరిశీలించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయకుమార్, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు చారిత్రాత్మకం



మిరుదొడ్డి(దుబ్బాక) : మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు భూపాల్ గౌడ్

మిరుదొడ్డి(దుబ్బాక) /సిద్దిపేటకమాన్: తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలుపడం చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్నై భూపాల్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు మాజీ సర్పంచ్ కిష్టయ్య, వెంకటయ్య, కిష్టయ్య, నర్సింహులు, లక్ష్మయ్య నర్సింహులు పాల్గొన్నారు. బీసీ కులగణన చేపట్టి అసెంబ్లీలో ఆమోదం తెలపడం ద్వారా బీసీలకు ఎంతో మేలు జరుగుతుందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో కన్వీనర్ నరసింహారెడ్డి అన్నారు. కార్యక్రమంలో ప్రదీప్‌రెడ్డి, చంద్రశేఖర్, రాజిరెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల అరిగోస

బోర్లు ఎత్తిపోవడంతో ట్యాంకర్ నీరే దిక్కు

- కొండపాక, కుకునూరుపల్లి మండలంలో 36 వేల ఎకరాల్లో సాగు
- కండ్ల ముందే పంటలు ఎండుతుంటే విలవిల్లాడుతున్న రైతులు
- అప్పులు చేసి మరీ బోర్లు వేసినా నీరు రాని పరిస్థితి
- చెరువులకు నీటిని విడుదల చేయాలని వేడుకోలు



తిమ్మారెడిపల్లిలో వరికి ట్యాంకర్ ద్వారా నీటిని పెడుతున్న రైతు

కొండపాక(గజ్వేల్): పాలకులు, అధికారుల నిర్లక్ష్యం మూలంగా చేతి కందే దశకు చేరిన వరి పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు అరిగోసలు పడుతున్నారు. తలాపునే తపాస్‌పల్లి, మల్లన్న సాగర్ రిజర్వాయర్లు ఉన్నప్పటికీ సాగు నీటి కష్టాలు తప్పడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి కొండపాక మండలంలో 20వేల ఎకరాల్లో, కుకునూరుపల్లి మండలంలో 16 వేల ఎకరాల్లో రైతులు వరిని సాగుచేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పోయిన యేడు కంటే సుమారు రెండు మండలాల్లో 6 వేల ఎకరాల వరి సాగును తగ్గించారు. అయినా వేసిన పంటలను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో అప్పులు చేసి బోర్లు వేస్తున్నా పడటం లేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు అదనపు ఖర్చులు భరిస్తూ ట్యాంకర్ల ద్వారా పంటలకు నీటి తడులను అందిస్తున్నారు. ప్రస్తుతం వరి పొట్ట దశకు చేరుకుంటుండటంతో నీరు ఎక్కువగా తీసుకుంటుంది. ముదిరిన ఎండలకు బోరుబావుల్లో నీరు తగడంతో తిమ్మారెడిపల్లి, బందారం, అంకిరెడ్డిపల్లి, మర్పడ్గ, సిర్సనగండ్ల, లకుడారం, ఖమ్మంపల్లి, కొండపాక గ్రామాల్లో కండ్ల ముందే పంట ఎండిపోతుంటే చూడలేని అన్నదాతలు ట్యాంకర్ల ద్వారా వరి పంటలకు నీటిని అందిస్తూ కాపాడుకుంటున్నామని పేర్కొంటున్నారు. రెండు మండలాల్లో సుమారు 200 ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమీపంలో రెండు రిజర్వాయర్లు ఉండటంతో సాగు నీటి కష్టాలుండవన్న రైతుల ఆశలు పాలకులు అడియాశలు చేస్తున్నారు. అధికారులు స్పందించి తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు నీటిని విడుదల చేసి పంటలు ఎండిపోకుండా కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లిపై ఆరోపణలు చేస్తే సహించం



కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

రసమయి ఫాంహౌస్ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సీఎంఆర్‌ఎఫ్ ఎల్ఓసీలలో అక్రమాలకు పాల్పడ్డారని, సాగునీటి సరఫరాలో విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తప్పుడు ఆరోపణలు చేయడంపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. బుధవారం గుండారంలోని ఆయన ఫాంహౌస్ ముట్టడికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. దీంతో బెజ్జంకిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు రత్నాకర్‌రెడ్డి, కృష్ణ, రమణారెడ్డి, రాఘవ రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి చేయకుండా మాజీ ఎమ్మెల్యే ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఆయన చేసిన ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను గృహ నిర్బంధం చేసి, ఆ పార్టీ నాయకులను అడ్డుకున్నారు.

బెదిరింపులకు భయపడం

- నిర్బంధించినా, దాడులు చేసినా ప్రజల కోసం పోరాటం ఆగదు

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి(సిద్దిపేట): సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులలో జరిగిన అక్రమాలపై మాట్లాడితే దాడులు చేయడానికి యత్నిస్తున్నారని, బెదిరింపులకు భయపడేది లేదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్పష్టం చేశారు. మండలంలోని గుండారం నుంచి వీడియో ద్వారా బుధవారం సందేశమిచ్చారు. ఇల్లంతకుంటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కేసులు, నిర్బంధాలకు భయపడకుండా తాను తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాని తెలిపారు. ఎమ్మెల్యే సత్యనారాయణ అక్రమాలపై పై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తనను నిర్బంధించినా, తనపై దాడులు చేసినా ప్రజల కోసం పోరాటం ఆగదన్నారు.

రసమయికి భద్రత కల్పించండి

ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీశ్‌రావు ట్వీట్

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు భద్రత కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు బుధవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే అవినీతిని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులను ఉసిగొల్పడం తగదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రాష్ట్ర డీజీపీ, సిద్దిపేట సీపీలను డిమాండ్ చేశారు.

హుస్నాబాద్‌లో నక్ష ఏరియల్ సర్వే

ఆస్తుల వివరాలు నమోదు



డిజిటల్ సర్వే చేస్తున్న సర్వే అధికారులు

హుస్నాబాద్: నక్ష ఏరియల్ సర్వేతో ప్రతి ఇల్లు, ఆస్తిని అక్షాంశ, రేఖాంశాలతో గుర్తించి ఆస్తుల విస్తీర్ణాన్ని డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తామని సర్వే ఆఫ్ ఇండియా పీటీఆర్ రంగస్వామి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించేందుకు నక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. హుస్నాబాద్ మున్సిపాలిటీని నక్ష పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి బుధవారం సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ ఇళ్లు, భవనాలు, ఇతర నిర్మాణాలు, భూములకు సరిహద్దులను గుర్తించి ప్రాపర్టీ కార్డును జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్డు ద్వారా ఇంటి రిజిస్ట్రేషన్లు, బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, రెవెన్యూ సర్వేయర్ లక్ష్మీనారాయణ, సర్వే సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ వారసులను విధుల్లోకి తీసుకోవాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల స్థానంలో వారి వారసులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని బుధవారం వీఆర్‌ఏల సంఘం నాయకులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుడుమల్ల రాజులింగం మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్న 61 సంవత్సరాల పైబడిన వీఆర్‌ఏల వారసులను ఆదుకోవాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ వారసులు ఆంజనేయులు, శ్రీనివాస్, కిషన్, మధు, మహేశ్, రాణి, శ్రీహరి, రాజు పాల్గొన్నారు.

దాతల సహకారంతో లకుడారానికి నీరు



మరమ్మతులు తరువాత నీరు వస్తున్న దృశ్యం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామంలో నెలకొన్న తీవ్ర మంచి నీటి ఎద్దడి పై అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజులుగా గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి కోసం ప్రజలు పిల్లా పాపలతో క్యూ కడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం పాఠకులకు తెలిసిందే. ప్రజల ఇబ్బందులను చూసి దాతలు చలించారు. మైసమ్మ తల్లి దేవాలయం వద్ద ఉన్న దెబ్బతిన్న బోరు మోటర్‌కు మరమ్మతులు చేయించి మినీ ట్యాంకులోకి నీటి సరఫరా జరిగేలా చూశారు. మంచి నీటిని అందించడంలో ముందుకొచ్చిన దాతలు వెంకట్‌రెడ్డి, భూమయ్య, రవీందర్, దేవి రవీందర్, భిక్షపతి, బాలమల్లు గౌడ్, బాబు, శ్రీనివాస్‌లకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తప్పనిసరి

దౌల్తాబాద్ (దుబ్బాక): విద్యలో వెనుకబడిన విద్యార్థుల గురించి వారి మేధస్సును పెంచే విధంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత లెర్నింగ్ టూల్స్‌ను బుధవారం మండల పరిధిలోని ఇందూప్రియాల్ గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ అఫ్జల్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, సీఆర్పీలు నగేశ్, కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



పనులకు శంకుస్థాపన చేస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఇందులో భాగంగానే సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ. 5కోట్లను కేటాయించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు కుమార్, కరుణాకర్‌రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్రమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ 10లక్షలతో తోటపల్లి రామాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. ఈ పనులకు బుధవారం బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు అజయ్‌వర్మ, మండల పార్టీ అధ్యక్షుడు రాజు, నాయకులు, మల్లేశం, అనిల్‌రావు, సుధీర్‌రావు, రవి, చందర్‌రావు, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

హుస్నాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని, రోజులు దగ్గరపడ్డాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా శంకర్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల ద్వారా తప్ప, రాష్ట్ర ప్రభుత్వం ఏ పథకం ద్వారా హుస్నాబాద్ అభివృద్ధిలో పాలుపంచుకోలేదన్నారు. పొన్నం ప్రభాకర్ ఇచ్చిన మాట ప్రకారం హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలుపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రాంగోపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్ రావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తిరుమల, పాల్గొన్నారు.

దివ్యాంగుల జేఏసీ ఏర్పాటు

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక డాక్టర్ బాబు జగ్జీవన్ రాం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో జేఏసీ ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా దండు శంకర్, గౌరవ సలహాదారులుగా శ్రీశైలం గౌడ్, సంపత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుర్గయ్య, ఉపాధ్యక్షులుగా అశోక్, సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య, సహాయ కార్యదర్శులుగా వీరేశ్, మల్లేశం, కోశాధికారిగా బాబుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

తల్లిదండ్రులు, గురువులకు పాదపూజ



పాద పూజ చేస్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తమను పెంచి పెద్ద చేస్తున్న తల్లిదండ్రులు, తమకు విద్యా బుద్ధులు నేర్పిస్తున్న గురువులకు పాద పూజ చేసి విద్యార్థుల ఆశీస్సులు పొందారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌లో 243 మంది 10వ తరగతి విద్యార్థులు, తమ తల్లిదండ్రులకు, 45మంది గురువులకు పాద పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పురాతన కాలం నుంచే తల్లిదండ్రులు, గురువులకు పాద పూజ చేసే సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంక్షల్లేకుండా పంటను కొనుగోలు చేయాలి



చిన్నకోడూరులో రైతుల నిరసన

చిన్నకోదూరు(సిద్దిపేట): పొద్దు తిరుగుడు గింజలను ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బుధవారం చిన్న కోడూరులోని కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నిరసన తెలిపారు. పొద్దు తిరుగుడు పంటను 6 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తామని ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. రైతులు పండించిన మొత్తం పొద్దుతిరుగుడు పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ఆలయానికి బోనాలు తీసుకువస్తున్న భక్తులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీ మహారేణుకా ఎల్లమ్మ ఆలయ 49వ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో బుధవారం ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలు చేసి డప్పు చప్పుళ్ల, పోతురాజుల విన్యాసాల మధ్య ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం అమ్మ వారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పదిలో ప్రతిభ చాటాలి

తొగుట(దుబ్బాక): పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలను సాధించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలంలోని గుడికందుల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రణాళికా బద్ధంగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, హాల్ టికెట్లు, జామెట్రీ బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ అనాథలకు అండగా ఉంటాం

తొగుట(దుబ్బాక): మండల పరిధి ఎల్లారెడ్డిపేటలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన చిన్నారులను పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ వెలుపుల స్వామి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డిలు బుధవారం పరామర్శించి రూ.28వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల పరిస్థితిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు స్వామిగౌడ్, కుమార్, ప్రభాకర్‌రెడ్డి, కిషన్, రాకేశ్, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ భద్రాద్రి రాముడికి గోటి తలంబ్రాలు

మిరుదొడ్డి(దుబ్బాక): భద్రాద్రి రాముడి కల్యాణ మహోత్సవానికి మిరుదొడ్డిలోని సీతారామాంజనేయ స్వామి ఆలయం నుంచి గోటి తలంబ్రాలను సమర్పిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు రాజగోపాల చారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో ప్యాకెట్‌లో 10 గ్రాములు వడ్ల గింజలు ఉండగా, 250 ప్యాకెట్లను బుధవారం భక్తులు గోటితో ఒలుస్తున్నారని, ఈ తలంబాలను రాములోరి కల్యాణ మహోత్సవాల్లో సమర్పిస్తామని తెలిపారు.

◆ రూ. 20 వేల విలువైన సామగ్రి పంపిణీ



చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఎడ్ల శ్రీకాంత్ రెడ్డి జ్ఞాపకార్థం అతడి మిత్రులు బుధవారం విద్యార్థులకు రూ. 20 వేల విలువైన పరీక్షా ప్యాడ్‌లు, స్టేషనరీతో పాటు సామగ్రిని పంపిణీ చేశారు. శ్రీకాంత్ రెడ్డి స్నేహితులు అందించిన చేయూతను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు సత్తవ్వ, అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ పీఎం విశ్వకర్మ పథకంలో నిర్లక్ష్యం తగదు

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించేందుకు యువకులకు శిక్షణనిచ్చి రుణాలను అందించే పీఎం విశ్వకర్మ పథకం లబ్ధిదారుల పట్ల బ్యాంకుల నిర్లక్ష్యం తగదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బెజ్జంకిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెజ్జంకి యూనియన్ బ్యాంకులో యూనిట్ల లబ్ధిదారులకు రుణాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని పలువురు యువకులు పేర్కొన్నట్లు తెలిపారు. వెంటనే రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో పై అధికారులకు ఫిర్యాదు చేసి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటిదని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో గుర్రాల చైతన్య, అత్కూరి సుధాకర్, మారమైన వెంకటయ్య, తాళ్లపల్లి నర్సింలుకు మంజూరైన చెక్కులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, భాను, శ్యాం, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం... పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఐదు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 8 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.12వేల జరిమానా, వీరిలో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

◆ పేదలకు బియ్యం పంపిణీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవీ క్లబ్, వాసవీ క్లబ్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో యాద శ్రీనివాస్, వాసవి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా పేద ప్రజలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, జోన్ చైర్మన్ రవి, కుమార్, శివశంకర్, సత్యనారాయణ, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.